పరివర్తనం

[కథానిక]

= 'వనఫూల్' =

ఖర్జూరపు బెల్లంతో చేసిన మిఠాయి తినటంవల్ల నా నోరంతా చేదుఎక్కింది. కాని మిఠాయి బాగానే ఉంది.

అయితే ఈకథ మొదటినించీ వినండి.

*　　*　　*

హరిమోహనుడు గొప్పవాడు. ధనాభావం అతనికి లేదు. అంచేత చికిత్సలోపంవల్ల అతను చచ్చిపోడని నాకు తెలుసు. డబ్బుద్వారా ఎంత చికిత్స కొనవచ్చునో అంతా కొంటాడు, కొంటున్నాడుకూడా. ఇద్దరు ప్రసిద్ధికెక్కిన డాక్టర్లు రోజూ రెండుసార్లు వచ్చి అతన్ని చూసిపోతున్నారు. కావాలంటే ఇద్దరు నర్సులు కూడా వచ్చి అతని శుశ్రూషభారం నెత్తిని వేసుకునేవాళ్లే; కాని సరమ వొప్పుకోలేదు. తనే స్వయంగా భర్తకు పరిచర్యచేయటం మొదలుపెట్టింది. ఆమెసేవానైపుణ్యం చూసి ఇద్దరు డాక్టర్లూ కూడా పరిచర్యలో లోపమేమీ జరగటం లేదని వొప్పుకున్నారు. డబ్బు తీసుకునే నర్సు ఇంత చేస్తుందో లేదోకూడా సందేహమే.

కాని రోగం చాలా ప్రమాదకరమైనది— క్షయ. నోటినుంచి రక్తం పడుతున్నది; రోజూ జ్వరం విడవకుండా ఉంటున్నది. కళ్లే పరీక్షించారు. క్షయకీటాణువులుకూడా కనిపించినై. ఇక సందేహానికికూడా అవకాశం లేదు. డబ్బుతూకంతో చికిత్స చేయించవచ్చు, కాని లాభం ఉంటుందని తోచలేదు. అంచేత అతని జీవితనాటకానికి తెరపడటం చాలా దగ్గరికి వచ్చిందని అనుకోసాగాను.

హరిమోహనుడు నా బాల్యమిత్రుడు. క్లాసులో ఇద్దరం ప్రక్క-ప్రక్కనే కూర్చునేవాళ్లం. అంచేత ఆ ఘనిష్ఠత స్నేహంక్రింద మారింది. ఎంచేతనో చెప్పలేను. అది ఇంకా నిలిచిఉందికూడా. న్యాయానికి ఉండవలసింది కాదు. ధనికునీ, దరిద్రునీ స్నేహం క్షణభంగురం. మా అదృష్టంవల్ల అది ఎందుకు నిలిచిందో చెప్పలేను. ఎందుకైనా నిలవనీయండి, నేనుమాత్రం రోజూ అతని క్షేమం కనుక్కోటానికి వెళ్లుతుండేవాడిని.

అసలు ముఖ్యంగా వెళ్లడం ఎందుకంటే, హరిమోహనుడికి ఈప్రపంచంలో డబ్బూ, భార్యాతప్ప ఇక నా అనటానికేమీ లేదు. బెల్లం ఉంటే చీమలు చేరకుండాఉండవు! రెండు లింగాలకూ చెందిన చాలా చీమలు ఈయింటికి రాకపోకలుకూడా మొదలుపెట్టినై! కాని హరిమోహనుడి జబ్బు నిఖరంగా క్షయ అని తేలినతర్వాత ఈ పిపీలికలు ఒక్కటొక్కటే అంతర్ధానంకావడం మొద

లుపెట్టినై. బహుశా బెల్లపుగిడ్డంగి ఉన్న ఇంకోచోటికి చేరిఉండవచ్చు! పోనివ్వండి ఆసంగతి. మొత్తానికి నేను ఒక్కణ్ణే మిగి లాను. స్నేహితుడి భార్య కావడంవల్ల సర మతో నాకు ఉన్న మామూలుపరిచయం క్రమంగా ఎక్కువకావడం మొదలుపెట్టింది- ఇప్పుడు తోస్తున్నది నాకు, అలా కాకుండా ఉన్నా బాగుండేదని.

* * *

హరిమోహానుడు కూర్చుని దగ్గు తున్నాడు.

గుండెలు పగిలిపోయే క్షయదగ్గు!

దగ్గు తగ్గినతర్వాత అతను-"నాగొంతు అంతా చెడిపోయింది. మందు రాచీ రాచీ- పుక్కిలించి ఊసీ ఊసీ నేను హైరాను అవు తున్నాను. ఐనా దగ్గు ఏమీ తగ్గటంలేదు, ఎందుకో చెప్పూ!" అని నన్ను అడిగాడు.

"తగ్గుతుంది, తగ్గుతుంది - ఎందు కంత గాభరాపడతావు?" అన్నాను.

"గాభరాపడే బాపతు కాదు, మనం! కాని ఈదగ్గు ఉండే చాలా వేధిస్తున్నది" అని ఈ రెండుమాటలూ చెప్పి మళ్లీ దగ్గటం మొదలుపెట్టాడు.

కాసేపు ఇద్దరమూ మాట్లాడలేదు.

"కళ్లె పరీక్షచేస్తే ఏమీ కనిపించలేదట, విన్నావుగా? ఏమీ ఉండదనికూడా నాకు ముందే తెలుసు. ఇన్ఫ్లూయెంజాఎటాక్ అని నా అనుమానం"అన్నాడు హరిమోహానుడు.

సరమ ఒక కప్పో పాలు తీసుకుని గది లోకి వచ్చింది.

హరిమోహానుడికి మళ్లీ దగ్గు వచ్చింది. తగ్గినతర్వాత "మళ్లీ అదేమిటీ?" అని అడి గాడు సరమను.

"పాలు"

"ఇప్పుడు మళ్లీ పాలెందుకూ?"

"డాక్టర్లు చెప్పిపోయారు ఇవ్వమని"

"తెంచుతున్నారు నాదుంప-కాసేపన్నా నాకు విశ్రాంతి ఇవ్వరా? ఇంతకుముందే-" మళ్లీ దగ్గటం మొదలుపెట్టాడు హరిమోహా నుడు. దగ్గు తగ్గినతర్వాత "- ఇంతకుముందే మందు త్రాగాను. ఆతర్వాత గార్గలింగు, మళ్లీ స్ప్రే, ఆతర్వాత పళ్లరసం — ఇప్పుడు మళ్లీ పాలు!"

"బాగా తింటేనే త్వరలో లేచి తిరుగు తారని డాక్టర్లు చెప్పారు. పాలుకూడా ఎక్కువ తేలేదు, తీసుకోండి" - సరమ కప్పు అందించింది.

హరిమోహానుడు రెండుగుక్కలు త్రాగి "ఇక వద్దు, నన్ను వదిలిపెట్టండి, మీకు పుణ్యం ఉంటుంది. నాకడుపులో ఖాళీకూడా లేదు" అన్నాడు.

"ఊహుఁ-ఇంకొంచెం త్రాగండి. మీరు కూడా చెప్పండి కాస్త" అన్నది నాతో. నేనుకూడా బలవంతంచేశాను.

"సరే, నీమాట దక్కించటానికి ఇంకో గుక్క తాగుతాను"

అరకప్పుకు ఎక్కువ అతను తాగలేదు.

సరమ కప్పు తీసుకుని ప్రక్కగదిలోకి వెళ్లింది. నేనుకూడా లేచాను. పొద్దుకూడా

పోయింది. సరమకు ఒక్కమాట చెప్పిపోవాలి: టెంపరేచరుసంగతి హరిమోహనుడికి చెప్పవద్దని డాక్టర్లు చెప్పారు.

"తొమ్మిదయింది. మళ్లీ రేపు వస్తాను" అన్నాను అతనితో.

"సరే"

హరిమోహనుడు ప్రక్కకు తిరిగి పండుకున్నాడు.

* * *

ప్రక్కగదిలోకి వచ్చాను. అక్కడ దృశ్యం చూసేవరకు నాకు ఆశ్చర్యం వేసింది. సరమ హరిమోహనుడు ఎంగిలిచేసిన పాలు తాగుతోంది!

"ఏమిటీ మీరు చేస్తున్నదీ?" అన్నాను నేను.

పట్టుపడటంచేత సరమ కొంచెం సిగ్గుపడింది. ఆ ఎఱ్ఱబడ్డ ముఖంతోనే "ఆఁ, అదేమీ లేదులెండి" అని, ఆతర్వాత కొంచెం కుదుటబడి "మీరెలాగూ చూశారు. కాబట్టి ఈసంగతి ఎవరికీ చెప్పకండి" అన్నది తొట్రుపాటు లేకుండా.

"సరే, చెప్ప ననుకోండి. కాని మీరు ఎంగిలిపాలు తాగుతా రెందుకూ?"

సరమ కొంచెం నవ్వి "భర్త ఎంగిలి తింటే తప్పేముంది?" అన్నది.

తప్పా ఏమిటా!

క్షయ ఎంత భయంకరమైన అంటువ్యాధో, దాన్నిగురించి నాకు తెలిసినంతవరకు చెప్పాను. సరమ ఆదినించి తుదివరకూ ఎదురుచెప్పకుండా విన్నది. ఆతర్వాత మెరుస్తున్న రెండుకళ్లూ నామీద నిలిపి "నాకు అంతా అర్థమైంది. కాని ఒక్కవిషయం నాకు తెలియజెప్పతారా? వారు బ్రతకకపోయినట్లయితే నేను బ్రతికిఉన్నందువల్ల ఏమన్నా లాభం ఉందా? పిల్లలన్నా ఉన్నట్టయితే ఒకవిధంగా ఉండేది అనుకోండి!" అన్నది.

నేను చాలాసేపు ఆమెకు హితోపదేశం చేశాను. ఆమె తల వంచుకుని నవ్వుముఖంతో అన్నీ విన్నది-అతీ పతీ చెప్పలేదు.

* * *

హరిమోహనుడి జబ్బు నానాటికీ ఎక్కువవుతున్నది. అతనిది క్షయజబ్బు అన్నసంగతి అతనిదగ్గర ఇక దాచటానికికూడా వీలులేకపోయింది. అతనికి తెలిసినతర్వాత చాలా గాభరాపడ్డాడు. అతన్ని చూస్తున్న ఇద్దరు డాక్టర్లూకూడా ఆదుర్దాపడి ఇంకా ఇద్దరు డాక్టర్లని తీసుకొచ్చారు. నలుగురూ కలిసి కొన్ని యక్సురేఫొటోలు తీయించాలని నిర్ణయానికి వచ్చారు. నిర్ణయానికి రావటమే తడవు, యక్సురేలు తీయించారు. వాటిని బట్టి చూస్తే జబ్బు ఒక్క ఊపిరితిత్తికేననీ, రెండోది బాగా ఉన్నదనీ తేలింది. శానిటోరియంకు వెళ్లి శస్త్రచికిత్స చేయిస్తే నయం కావచ్చునని సలహాయిచ్చారు.

ధనలోపం లేదు. హరిమోహనుడు వెంటనే శానిటోరియంకు వెళ్లాడు. సరమ కూడా వెంటవెళ్లింది.

* * *

ఆతర్వాత చాలారోజులవరకు హరిమోహనుడి కబురు నాకేమీ తెలియలేదు.

కొంతకాలం ఉత్తరప్రత్యుత్తరాలు జరిగినై కాని, తర్వాత క్రమంగా ఆగిపోయినై. హరిమోహనుడు వెనకటికంటే కొంచెం బాగుపడ్డాడనిమాత్రం తెలిసింది. ఆతర్వాత హరిమోహనుడి విషయమై నేను అంతగా పట్టించుకోలేదు. అతనుకూడా నాకు ఉత్తరాలు వ్రాయలేదు. హఠాత్తుగా ఒకనాడు హరిమోహనుడు స్విజర్లాండు వెళ్లాడని తెలిసింది. ఎందుకో, ఏంపనిమీదో నాకు తెలియలేదు. డబ్బుంది, వెళ్లక ఏమి చేస్తాడని అనుకున్నాను!

నేను విరామం లేకుండా అదే గుమాస్తాపని చేస్తున్నాను. తాహతును మించి తెలుసుకోవటంకూడా అనవసరమే. అసలు ఆ వీలుకూడా లేదు: హరిమోహనుడు నాకు అడ్రసు ఇచ్చిపోలేదు.

* * *

పదిసంవత్సరాలు గడిచినై.

హరిమోహనుడి సంగతి దాదాపు మరిచేపోయాను. ఇలాంటి పరిస్థితిలో హఠాత్తుగా అతని దగ్గరనించి ఉత్తరం వచ్చింది. రెండే ముక్కలు.

"భాయీ నరేశ్!

వచ్చే మంగళవారం నేను కలకత్తా వస్తున్నాను. నన్ను కలుసుకో,

హరిమోహన్"

అడ్రసు చూశాను. హరిమోహనుడు వాళ్ల ఊరినించి రాశాడు. అతను ఈ దేశం ఎప్పుడు వచ్చాడోకూడా నాకు తెలియదు.

* * *

మంగళవారంనాడు ఆఫీసునించి తిరిగి వస్తూ వాళ్లఇంటికి వెళ్లాను. అతను ఇంట్లోనే ఉన్నాడు. చాలా మర్యాదచేసి నన్ను కూర్చోబెట్టాడు. హరిమోహనుణ్ణి చూసి నేను ఆశ్చర్యపోయాను. అతని ముఖం నెత్తురుపట్టి తళతళలాడుతున్నది! ఎవరనుకుంటారు, అతనికి క్షయ వచ్చిందని!

"బాగా నయమైంది కాదూ?" అని అడిగాను.

"ఆc. కంప్లీట్‌గా."

ఏఏ డాక్టర్ల చికిత్సానైపుణ్యంవల్ల అతని ఈ వ్యాధి నిమ్మళించిందో, వాళ్లని అమితంగా ప్రశంసించటం మొదలుపెట్టాడు.

"స్విజర్లాండు వెళ్లావుకదూ?"

"ఆc."

"ఎలా ఉందీ?"

"అద్భుతంగా! పుస్తకాల్లో చదివినదానికంటే ఎన్నోరెట్లు అందంగా ఉంది. పద, పైకి పోదాము."

పైకి వెళ్లాము. పైకి పోగానే హరిమోహనుడు కేకలు మొదలుపెట్టాడు: "సరమా, ఎక్కడ నీవు? నరేశ్ వచ్చాడు: ఫలహారమూ, టీ తీసుకురా—కూర్చో, కూర్చో."

మంచి ఖరీదైన సోఫా. జాగ్రత్తగా కూచున్నాను. హరిమోహనుడు అడగటం మొదలుపెట్టాడు:

"ఆc. ఆతర్వాత, నీసంగతులేమిటో చెప్పు! నువ్వు చాలా మారిపోయినట్టు కనపడుతున్నావు. చెంపలంతా నెరిసిపోయినవోయ్! ఈమధ్యనే ముసలివాడివయ్యావా! ఆ దేశంలో యాభైఏళ్లకుగాని అసలు యౌవనం ఆరంభించదు—తెలిసిందా?"

'ఆరంభించదు' అనే మాట కొంచెం వత్తాడు.

నాక్కూడా రోజూ కొంచెం జ్వరం రావటం, డాక్టర్లు క్షయ అని సందేహించటం జరుగుతున్నది. కాని ఈసంగతి అతనికి చెప్ప లేదు; చెప్పికూడా లాభంలేదు. అందుకని అన్నాను :

"ఈదేశానికీ ఆదేశానికీ చాలా తేడా ఉంది, హరీ! అదీకాక ఇంకోసంగతి నువ్వు మరచిపోతా వెందుకూ? నేను నాఇరవయ్యో యేటినించి గుమాస్తాపని చేస్తూవస్తున్నాను–ఊపిరి పీల్చటానికికూడా తీరికలేదు!"

"అయితే ఏం? పనిచేస్తే మనిషికి రోగం వస్తుందా?" అని హరిమోహనుడు బిగ్గరగా నవ్వాడు. ఇల్లు అదిరిపోయేటట్టు నవ్వడం హరిమోహనుడిలో విశేషం. అతని నవ్వు ఆగలేదు, అక్కడికక్కడికీ ఎక్కువైంది. అతని దేహంలోని ఆరోగ్యమూ, మనసులోని తారుణ్యమూ చూసి నాకు అసూయ కలిగింది. ఇరవైయైదుఏళ్లు వచ్చినతర్వాత అతని వయస్సు ఏమీ పెరిగినట్టుగా లేదు. అక్కడే ఆగిపోయింది!

సరమ ఫలహారపు పళ్లెం తీసుకుని గదిలోకి వచ్చింది.

సరమను చూసి నేనింకా ఆశ్చర్యపోయాను. పదిసంవత్సరాలలో మనిషి ఇంత మారిపోగలదా?

నేను దీక్షగా ఆమెముఖంవంక చూడటంచేత, సరమ కొంచెం ముడుచుకుపోయింది.

"టీ తీసుకువస్తాను!" అని ఫలహారపు పళ్లెం ముక్కాలిపీటమీద ఉంచి వెళ్లిపోయింది. ఎవరీమె!

"సరమ ఏమాత్రం గుర్తుపట్టటానికి వీలు లేకుండా ఉంది! ఈపదేళ్లలో చాలా మారిపోయిం దనుకుంటాను." అన్నాను హరిమోహనుడితో.

హరిమోహనుడు రెప్పవాల్చకుండా కాసేపు నావంక చూసి, ఆతర్వాత అన్నాడు : "ఆఁ. అసలే మారింది. ఇప్పుడు నువ్వు చూసిన సరమ ఆ వెనుకటి సరమ కాదు. ఆ సరమ చాలాకాలంక్రిందటే చచ్చిపోయింది. దానికికూడా క్షయవచ్చింది—రెండులంగులకూ." కాసేపు ఆగి మళ్లీ అన్నాడు : "ఆఖరిదశలో పేగులుకూడా చెడిపోయినై. చాలా ఖర్చుపెట్టాను, కాని బ్రతకలేదు."

ఇద్దరం కాసేపు మాట్లాడలేదు. హరిమోహనుడు మళ్లీ మొదలుపెట్టాడు :

" ఉండలేకపోయాను – రెండోమాటు వివాహం చేసుకోకతప్పలేదు. వెతికివెతికి ఆఖరుకు సరమపేరు గల పిల్లను పట్టుకోగలిగాను. ఆ పేరు నాకు నోటపట్టిపోయింది. పోయినవాళ్లు ఎలానూ రారనుకో. ఎలాగైనా పేరు—"

ఆగాడు. సరమ టీసరంజామా తీసుకొని వాకిట్లోనించి వస్తున్నది.

సరమ టీ టేబిలుమీద పెట్టి ఫలహారపుపళ్లెం హరిమోహనుడిముందుకు నెట్టగానే

హరిమోహానుడు— "అంత నేను తినలేను! ఎంత పెట్టావు నాకూ!" అన్నాడు.

సరమ అంటున్నది: "డాక్టరుగారు మిమ్మల్ని బాగా తినమన్నారు. ఈమధ్య మీ రసలు బొత్తిగా తినటమే లేదు—మీ రన్నా చెప్పండి మీ స్నేహితుడికి." అన్నది నాతో.

"నరేశుడికోసం ఖర్జూరపుబెల్లంతో చేసిన మిఠాయి తెచ్చావా? అతనికి ఆ మిఠాయి అంటే చాలా ఇష్టం!" అన్నాడు హరిమోహానుడు.

"ఆఁ. ఇదిగో తెచ్చాను." అన్నది సరమ.

హరిమోహానుడు నవ్వుతూ ఒక ప్లేటు ఖర్జూరపుబెల్లంమిఠాయి నా ముందుకు నెట్టాడు.

అను : 'చక్రపాణి'

మందులకేటలాగు నిజమైనచో